నిలకడగా గోదావరి వరద


అయోధ్యలంకలో వరద ముంపులో కొబ్బరి తోటలు, కూరగాయల తోటలు


సిద్ధాంతంలో గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు


వద్దిపర్రు గ్రామంలో వరదబాధితులతో మాట్లాడుతున్న అధికారులు

పెనుగొండ: వశిష్ట గోదావరి శాంతించింది. పెనుగొండ, ఆచంట మండలాల్లో గోదావరి నిలకడగా ప్రవహిస్తుంది. రెండు రోజుల పాటు ఉధృతంగా ప్రవహించిన గోదావరి నెమ్మదించడంతో పరివాహక ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకొంటున్నారు. ఒక్కసారిగా రెండు రోజులు పాటు ఉగ్ర రూపం దాల్చడంతో మరింత ఉధృతి ఉంటుందని భావించారు. బుధవారం ఉదయం నుంచి భద్రాచలం, ధవళేశ్వరంల్లో నీటిమట్టం తగ్గడంతో సాయంత్రం వరకూ పెరిగిన గోదావరి, అనంతరం నిలకడగా నిలిచింది. సిద్ధాంతం కేదారీఘాట్ నీటి మట్టం యథాస్థితిగా ఉంది. కేదారీఘాట్‌లోని పుష్కర రేవులు, పిండ ప్రధాన రేవులు నీటిలో మునిగి ఉన్నాయి. పెనుగొండ మండల వరదల ప్రత్యేకాధికారి, తహసీల్దారు, ఎంపీడీఓ, పోలీసులు వరద ఉధృతిని పరిశీలించారు. వరద ఉధృతి తగ్గే వరకూ మధ్యస్థ లంక రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నీటి మట్టం నిలకడగా ఉన్నా ప్రవాహం వేగంగా ఉన్నందున పడవలపై ప్రయాణం మంచిది కాదన్నారు. పూర్తిగా తగ్గేవరకూ రాకపోకలు నిలపివేయాలని సూచించారు.

అయోధ్యలంకలో

ఎగువ ప్రాంతంలో గోదావరి ఉధృతి తగ్గుతుండడంతో ఆచంట మండలంలోని గోదావరి నీటిమట్టం కొద్దిగా పెరుగుతుంది. తిరిగి గురువారం తెల్లవారుజామునకు తగ్గే అవకాశం ఉంది. ఆచంట మండలం అయోధ్యలంక, పెదమల్లం లంక, అనగారలంక, పుచ్చలంక, రావి లంక, పల్లేపాలెంల్లోని లంకభూములు నీట మునిగి ఉన్నాయి. కొబ్బరి తోటలు, అరటి తోటలు, కూరగాయల తోటలు నీటి ముంపులోనే ఉండడంతో అరటి, కూరగాయల పంటలు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయోధ్యలంకలోని పల్లపు ప్రాంతాల్లో వరద నీరు నిలిచే ఉండడంతో వరద నీటిలోనే రైతులు, గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరి ప్రమాదం పూర్తిగా తగ్గలేదని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వద్దిపర్రులో మరింత పెరిగిన వరద ఉధృతి

పోడూరు: వద్దిపర్రు గ్రామంలో బుధవారం వరద ఉధృతి మరింత పెరిగింది. గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు నీటమునగడంతో పాటు పలు నివాసాల చుట్టూ వరదనీరు చేరింది. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎంపీడీఓ డి.సుహాసిని, తహశీల్దార్ బీవీ మురళీకృష్ణ గ్రామంలో పర్యటించి వరద పరిస్థితిని సమీక్షించారు. 30 కుటుంబాలకు 10 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. గ్రామంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. బాధితులకు, గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ సుహాసిని, తహసీల్దార్ మురళీకృష్ణ విలేకరులకు తెలిపారు. గ్రామసర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు విప్పర్తి శారద, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓ వైపు ముంపు..మరో వైపు నీటి ఎద్దడి


గోస్తనీ పంట కాలువకు కుడివైపు ముంపులో ఉన్న చినపైడవ ఆయకట్టు పొలాలు


వెలగలవారిపాలెంలో సాగునీరు నిలిచిపోయిన పెద పైడవ ఆయకట్టు పొలాలు

పెనుమంట్ర: గోస్తనీ పంటకాలువలో నీటిమట్టం తగ్గుముఖం పట్టడం, గోస్తనీ డ్రెయిన్‌లో వరదనీరు మరింత పెరగడంతో బుధవారం గోస్తనీ పంటకాలువ ఎడమ వైపు పంటభూమిలో సాగునీటి ఎద్దడి నెలకొంటుండగా, కుడి వైపు గోస్తనీ డ్రెయిన్ పరివాహక ప్రాంతంలో పంటభూములు ముంపులోనే మునిగి ఉన్నాయి. వెలగలవారిపాలెం వద్ద గోస్తనీ పంటకాలువ నుంచి వెళ్లిన భట్లమగుటూరు బ్రాంచ్ కాలువకు షట్టర్‌లు దెబ్బతినడంతో ఆ కాలువకు నీరు వెళ్లకుండా మురుగునీటి సమస్య ఎదుర్కొనేందుకు రైతులు కాలువ తూములో గడ్డికట్టలు, రాళ్లు వేసి మూసేశారు. దీంతో ఆకాలవకు నీటి సరఫరా నిలిచిపోయింది. గత నాలుగు రోజులుగా వర్షాలు లేకపోవడంతో వెలగలవారిపాలెం పెద పైడవ, భట్లమగుటూరు ఆయకట్టు రైతులకు సాగు నీరు అందకపోవడంతో నాట్లు వేసిన చేలు బీటలు వారే పరిస్థితి వస్తుండగా, దమ్ముచేసిన చేలకు నీరందక నాట్లు తీయడానికి నాట్లు వేయడానికి ఇబ్బందిగా ఏర్పడింది. దీంతో భట్లమగుటూరు బ్రాంచ్ కాలువ తూములో రైతులు వేసిన గడ్డి కట్టలను తొలగించేందుకు మంగళవారం అధికారులు జేసీబీతో ప్రయత్నించి విఫలం కాగా, బుధవారం రైతులు కూడా తమ వంతు ప్రయత్నించి చేతులు ఎత్తేశారు. దీంతో పెనుమంట్ర, వెలగలవారిపాలెం, భట్లమగుటూరు గ్రామాలకు చెందిన మూడు వేల ఎకరాలలో రైతులు ఒక పక్క ముంపు సమస్యను ఎదుర్కొంటుండగా, మరోపక్క సాగునీటి సమస్యను కూడా ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

నీట మునిగిన పొలాల పరిశీలన


రామన్నపాలెంలో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ అనిలకుమారి

మొగల్తూరు: గత వారం రోజులుగా కురుసిన వర్షాలకు చేలు నీటమునిగిన రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని వ్యవసాయ సహాయ సంచాలకులు ఇ.అనిలకుమారి సూచించారు. మండలంలోని రామన్నపాలెంలో నీటమునిగిన పొలాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొగల్తూరు మండలంలో సుమారు 1620 ఎకరాల్లో సార్వా సాగు చేపట్టనున్నట్లు అంచనా వేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు సుమారు 113 ఎకరాల్లో వరి నాట్లు వేయగా వర్షాల కారణంగా 64 ఎకరాలు ముంపునకు గురికాగా, 49 ఎకరాలు ఇంకా ముంపులోనే ఉన్నాయన్నారు. అలాగే 30 ఎకరాల్లో నారుమడులు వేయగా, 15 ఎకరాల నారుమడులు దెబ్బతిన్నాయన్నారు. ముంపు చేలల్లో నీరు లాగిన అనంతరం ఎకరానికి 15 కిలోల యూరియా, 20 కిలోల పోటాష్‌లను వినియోగించాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ ఉన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి


ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ పట్టణ శాఖ సెక్రటరీ కె.త్రినాథ్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈవో గుమ్మళ్ల వీరాస్వామి, శర్మలకు పాఠశాలల్లో సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు బోధించుటకు అవసరమైటన రాత పూర్వక బదిలీలు (తాత్కాలిక) చేయాలని, ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్స్ నమోదు కావాల్సిన అంశాలు నమోదు చేయాలని, గత సంవత్సరం మౌఖికంగా విలీనం చేసిన 7 ప్రాథమిక పాఠశాలల సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ప్రస్తుతం ఎస్‌జీటీలుగా పనిచేస్తూ పండిట్స్‌గా అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ప్రమోషన్ అంశాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలని వినతి పత్రం అందించారు.కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జి.లక్ష్మీనారాయణ, రాంజీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ మృతి తీరని లోటు


ఎంపీడీఓ వెంకటరమణారావు సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో అచ్యుత అంబరీష్

నరసాపురం రూరల్: అంకితభావం కలిగిన నరసాపురం మండలపరిషత్ అభివృద్ధి అధికారి మండవ వెంకటరమణారావు మృతి తీరని లోటని ఆర్డీఓ అచ్యుత అంబరీష్ అన్నారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాయ సమావేశ మందిరంలో ఇటీవల మృతి చెందిన ఎంపీడీఓ సంతాప సభను ఎంపీపీ మైలాబత్తుల సోని అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ ఎంపీడీఓ రమణారావు సేవలను కొనియాడారు. జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్ నాయుడు తదితరులు మాట్లాడుతూ నరసాపురం ఎంపీడీఓగా రమణరావు తక్కువకాలం పనిచేసినప్పటికీ అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వీకే వీరభద్రరావు, తహసీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముంచిన వరుణుడు


మొగల్తూరు గొల్లగూడెం రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

మొగల్తూరు: గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు చేలల్లోను వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులతో పాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా 105.2 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. దీంతో మొగల్తూరులోని ప్రధాన రహదారులైన గొల్లగూడెం రోడ్డు, స్టేషన్‌రోడ్డు, రామాలయం నుండి కోట మీదుగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారిలో వర్షపు నీరు నిలిచిపోయింది. కాళీపట్నం పడమర, కేపీ పాలెం, పేరుపాలెం, మొగల్తూరులోని పల్లపు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచిపోయింది. మొగల్తూరులోని గొల్లగూడెం, ఇంజేటివారిపాలెం, నక్కావారిపాలెం, పాలకమ్మ చెరువు, రామన్నపాలెం పంచాయతీలోని అడవిపర్ర, సుబ్బారాయుడు గుడి ప్రాంతాల్లో చేలు ఏరులను తలపిస్తున్నాయి. ఆకుమడుల్లోను, ముందుగా నాట్లు వేసిన చేలల్లో నీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అందించాలి


వీవర్స్ కాలనీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: చంటి బిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అందించాలని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు సూచించారు. పాలకొల్లు మండలం, పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ వీవర్స్ కాలనీలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యాధి నిరోధక టీకాలు నమోదు రిజిస్టర్, డ్యూటీ లిస్ట్ రిజిస్టర్ పరిశీలించారు. ఎంఆర్ 1, ఎంఆర్ 2 టీకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డయేరియా కార్యక్రమంలో ఇంటింటి సర్వేపై డాక్టర్ హేనను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు ఎన్ని ఇస్తున్నారో ఆరా తీశారు. ఆయన వెంట సూపర్‌వైజర్ జి అన్నామణి, ఏఎన్ఎంలు ఝాన్సీ, రత్నం తదితరులు ఉన్నారు.

ఘనంగా వెంకటరమణయ్య జయంతి

పాలకొల్లు సెంట్రల్: ప్రతి గ్రామంలో పాఠశాలతో పాటు గ్రంథాలయం కూడా ఉండాలని గ్రంథాలయ ఉద్యమంలో తుదివరకూ పోరాటం చేసిన గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ, డాక్టర్ అయ్యంకి వెంకటరమణయ్య పోరాటం అభినందనీయమని శాఖా గ్రంథాలయాధికారిణి వి శాంతకుమారి అన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ వెంకటరమణయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మల్లికార్జునరావు, సీతారాం, శాంతారావు, సూర్యనారాయణ, వెంకట్, రాజేష్, పూజిత తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా ఫీడ్‌కు పన్ను తగ్గింపుపై హర్షం

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించిన బడ్జెట్‌లో ఆక్వా రైతులకు మేలు కల్పించే విధంగా ఉండడం అభినందనీయమని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. బుధవారం స్థానిక ఆక్వా సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గాంధీరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులకు సంబంధించిన ఫీడ్‌పై కస్టమ్స్ టాక్స్ 15 శాతం ఉండేదని దానిని 5 శాతానికి తగ్గించడం, అలాగే సీడ్ తెచ్చుకోవడానికి బ్లూస్టాక్‌పై టాక్స్ 10 శాతం ఉండగా దానిని 5 శాతం చేశారని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఆక్వా రైతులకు రాష్ట్ర విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోణం చినబాబు, కోడి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వరిచేలల్లో కాలిబాటలతో అధిక లాభం


యలమంచిలి మండలం శిరగాలపల్లిలో కాలిబాట వేసిన వరి చేను

యలమంచిలి: వరి చేను ఊడ్చిన తరువాత పొలంలో ప్రతి రెండు మీటర్లకు కాలిబాట వేయడం వల్ల రైతులకు అధిక ప్రయోజనం ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇలా చేయడం ద్వారా పైరు వేరు భాగానికి విస్తారంగా గాలి, సూర్యరశ్మి తగలడం, చీడ, పీడల సమస్య తగ్గడం, ఎరువులు, పురుగు మందులు చల్లే సమయంలో దారి సమస్య తగ్గడంతో పాటు ప్రతి ఎకరాకు మూడు, నాలుగు బస్తాలు అదనంగా పండి రైతులకు లాభాలు వస్తాయి. అయితే రైతులు కాలిబాటలు వేయడం అదనపు ఖర్చుగా భావించి ఆసక్తి చూపకపోవడంతో వ్యవసాయాధికారులు కాలిబాటల ప్రయోజనాన్ని రైతులకు వివరించడంతో రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.

కాలిబాటలు వేసే విధానం

కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. ప్లాస్టిక్ లేదా డొక్కతాడు తీసుకుని చేను గట్టు అవతలి వైపు నుంచి ఇవతలి వైపు వరకు బాగా సాగ దీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటిమీటర్లు వెడల్పున వరి నాట్లు తొలగించి పక్కనే పలుచగా ఉన్న ప్రదేశంలో నాటుకోవాలి. వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే విత్తనాలు చల్లిన తరువాత 15 నుంచి 20 రోజుల వ్యవధిలో కాలిబాటలు వేసుకోవాలి.

కాలిబాటలతో అధిక దిగుబడి..



ఒక ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.800 ఖర్చవుతుంది. కానీ కాలిబాటలు వేయడం వలన నాలుగు బస్తాల వరకు అధిక దిగుబడి రావడమే కాకుండా పంట కాలంలో చేను మొత్తం తిరగడానికి అనువుగా ఉంటుంది. దీనిపై మా సిబ్బందితో రైతులకు అవగాహన కల్పించడంతో ఇప్పుడు రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.

– చిందులూరి దేవి, యలమంచిలి మండల వ్యవసాయాధికారి

ప్రయోజనాలు ఇలా

- కాలిబాట వేయడం వల్ల పైరు మొదళ్లకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి విస్తారంగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది.
- చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు తొలగించడానికి, మందులు చల్లడానికి వీలు కలుగుతుంది.
- తెగుళ్లను సులభంగా గుర్తించడానికి, సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి ఎలుకలను నివారించడానికి వీలవుతుంది.
- తుఫాన్‌లు, భారీ వర్షాలు వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడిన సమయంలో పైరులో కిరణజన్య సంయోగక్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా ఉంటుంది.
- పైరులో చీడ పీడల ఉధృతిని దగ్గరగా గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది.

క్లుప్తంగా

గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు

మొగల్తూరు: ఆధార్ కార్డుల్లో తప్పులు సరిచేసుకునేందుకు మండలంలో నాలుగు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వి.బాబ్జీరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొగల్తూరు కుక్కలవారితోటలోని 3వ సచివాయల పరిధిలోను, రామన్నపాలెం, ముత్యాలపల్లి, కేపీ పాలెం సచివాలయాల్లో తప్పులు సరి చేసుకునేందుకు పిల్లల ఆధార్ కార్డుల నమోదు కోసం క్యాంపులు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ క్యాంపులు ఆయా గ్రామాల్లో ఈ నెల 27 వరకు ఉంటాయని పేర్కొన్నారు.

ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్‌గా రామకృష్ణ


గంధం రామకృష్ణ

నరసాపురం: వైఎన్ కళాశాల డీన్‌గా పనిచేస్తున్న గంధం రామకృష్ణకు కళాశాల ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ కో–ఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ ఉత్తర్వులిచ్చారు. ఈ మేరకు రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రామకృష్ణ ఈ సందర్భంగా చెప్పారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం రూరల్: మండలంలోని పీఎంలంక గ్రామంలోని స్కిల్ కళాశాలలో వివిధ కోర్సులకు సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి వసంతరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం మూడు కోర్సులకు సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నాయని ఫోర్‌మెన్, ఎలక్ట్రీషియన్, సోలార్ ప్యానల్ ఇన్‌స్టలేషన్ టెక్నీషియన్ కోర్సులకు శిక్షణను ఇస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తుదారుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, ఈ కోర్సుల్లో శిక్షణను పొందే వారికి ఉచిత వసతి కల్పిస్తామని, మరిన్ని వివరాలకు కళాశాల పని వేళల్లో సంప్రదించాలని వసంతరావు కోరారు.

వేణుబాబుకు మాతృవియోగం


కర్రి ఆదిలక్ష్మి(ఫైల్)

పెనుమంట్ర: పెనుమంట్ర మండల వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు, మార్టేరు గ్రామ ఉప సర్పంచ్ కర్రి వేణు బాబు మాతృమూర్తి కర్రి ఆదిలక్ష్మి (85) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆదిలక్ష్మి అంత్యక్రియలు గురువారం ఉదయం మార్టేరు శ్మశాన వాటికలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

త్వరలోనే వర్గీకరణ కల నెరవేరుతుంది


సమావేశంలో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: 30 సంవత్సరాల మాదిగల, ఉపకులాల వర్గీకరణ కల నెరవేరబోయే రోజులు అతి దగ్గర్లోనే ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చిన్నబాబు అన్నారు. బుధవారం స్థానిక మార్కెటింగ్ యార్డు ఆవరణలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ ఆదేశాల ప్రకారం నేటి నుంచి ప్రతి గ్రామంలో జెండా స్థూపం ఆవిష్కరణలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శరత్, యార్లగడ్డ రత్నరాజు, పలివెల పైడియ్య, గరికిపూడి జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదు


కొఠాలపర్రులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఏ ఒక్కరూ బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదని, ప్రోత్సహిస్తే చట్టప్రకారం బాధ్యులు అవుతారని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎ.కృష్ణకుమారి హెచ్చరించారు. బుధవారం ఐసీడీఎస్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా కొఠాలపర్రులో ఆధార్ కార్డు మొబైల్ క్యాంపు నిర్వహణతో పాటు, అవగాహన సదస్సు నిర్వహించి ర్యాలీ చేశారు. అనంతరం బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఎం.విజయ కుమారి పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు అర్థరహితం

వైఎస్సార్‌సీపీ నియోజవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి



పాలకొల్లు అర్బన్: అసెంబ్లీ సాక్షిగా బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు వైఎస్సార్ సీపీకి ఓటేసిన ప్రజలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలు పెత్తందారీ పోకడలకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 40శాతం ఓట్లేశారని, వారంతా అన్నం తింటున్నారా? అనే పదజాలం సాక్షాత్తు అసెంబ్లీలో వాడడం రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. తక్షణం ప్రజలకు క్షమాపణ చెప్పాలని గుడాల గోపి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డులను తొలగించి, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుపై రాజ్యాంగ ఉల్లంఘన కేసు పెట్టాలని గుడాల గోపి డిమాండ్ చేశారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మందుల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇద్దరు రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. బుధవారం వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ పేద ప్రజలకు విద్య, వైద్యంలో సేవలందించడానికి వాకర్స్ క్లబ్ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా రూ. 20 వేల విలువైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఫీర్ సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకరరావు, ధనాని శ్రీరామ్మూర్తి, నంబూరి గంగాపవన్, జవ్వాజి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలన

పెనుగొండ: విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలులో నాణ్యత పాటించాలని ఆచంట జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. బుధవారం ఆచంటలోని జెడ్పీపాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ నేత హర్షం

పెనుగొండ: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సముచిత స్థానం కల్పించి నిధులు కేటాయించారని పెనుగొండ మండల బీజేపీ అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూర్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పెనుగొండలో విలేకరులతో బడ్జెట్ అన్ని రంగాలకు ఊతం ఇచ్చేలా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు బహిరంగ క్షమాపణ చెప్పాలి


ఖండవల్లి వాసు

పాలకొల్లు అర్బన్: అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు రాజ్యాంగాన్ని అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలు తక్షణం వెనక్కి తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఖండవల్లి వాసు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ ఓటేసిన 40 శాతం ప్రజలు అన్నం తింటున్నారా? అంటూ అర్థరహితమైన వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. తక్షణం బీజేపీ ఎమ్మెల్యే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రతిభతోనే ఉన్నత శిఖరాలు

పెనుగొండ: విద్యార్థులు ఉత్తమ ప్రతిభతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇందుకూరి సూర్యనారాయణ రాజు అన్నారు. బుధవారం వల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు, ప్రశంసా పత్రాలను సూర్యనారాయణ రాజు దంపతులు అందించారు. సర్పంచ్ నేలపూడి బేబీ రామ్మోహన్ రావు, హెచ్ఎం శ్రీధర్ నరసింహం, పాఠశాల చైర్మన్ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.